క్లుప్తంగా

విద్యార్థినులు మానసికంగా దృఢంగా ఉండాలి



బొమ్మిడి పాఠశాలలో మాట్లాడుతున్న హెచ్‌ఎం పాలమూరి శ్రీదేవి

ఉంగుటూరు: విద్యార్థులు కౌమార దశలో మానసికంగా దృఢంగా ఉండాలని బొమ్మిడి హైస్కూలు హెచ్‌ఎం పాలమూరి శ్రీదేవి అన్నారు. బుధవారం బొమ్మిడి హైస్కూల్లో ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ జిల్లా కార్యదర్శి దాకి నాయుడు ఆధ్వర్యంలో విద్యార్థులకు మెంటల్‌హెల్త్ ఎంపవర్‌మెంటు కార్యక్రమం నిర్వహించారు. గురుస్పందన అవార్డు గ్రహీత గుదే శ్రీనివాసరావు మాట్లాడుతూ సృజనాత్మకంగా నైపుణ్యాలను వినియోగించకుంటూ జీవితంలో ముందుకు నడవాలని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పరందామరాజు, సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి కృషి



మత్స్య సంపద పథకంలో సబ్సిడీ వాహనం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం: మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన కార్యక్రమంలో భాగంగా మత్స్యకార యువతకు సబ్సిడీపై నాలుగు చక్రాల వ్యాన్‌లను అందజేశారు. ఒక్కో యూనిట్ విలువ రూ.22 లక్షలు కాగా, దీనిలో 60 శాతం సబ్సిడీ ఉంటుందన్నారు. మత్స్యకార యువతకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కోడే కాశీ, మండల వ్యవసాయ సలహా సంఘం చైర్మన్ పోలిశెట్టి రమేష్, తహసీల్దార్ సాయిరాజు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

4,5 తేదీల్లో ఓటర్ల నమోదు ప్రత్యేక శిబిరం



ఉంగుటూరు తహసీల్దారు కార్యాలయంలో మాట్లాడుతున్న ఆర్డీవో ఖాజా వల్లీ

ఉంగుటూరు: ఈనెల 4,5 తేదీల్లో అన్ని పోలింగు కేంద్రాల్లో ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నట్టు ఆర్డీవో కాజావల్లీ వెల్లడించారు. బుధవారం తహసీల్దారు కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ ప్రత్యేక కార్యక్రమం 214 పోలింగ్ కేంద్రాల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఓటర్ల నమోదు, చేర్పులు, మార్పులు చేసుకోవచ్చునని అన్నారు. ఓటరుగా నమోదుకు ఫారం 6 ఉపయోగించాలని, చేర్పులు, మార్పులకు ఫారం 8, తొలగించేందుకు ఫారం 7 ఉపయోగించాలని ఆర్డీవో వివరించారు. అన్ని పోలింగు కేంద్రాల్లో రెండురోజులు బీఎల్‌వోలు ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు వెంకటరమణ, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా రామాలయంలో విగ్రహాల ప్రతిష్ఠ పూజలు



భీమడోలులో పూజల్లో పాల్గొన్న ఆగమ పండితులు, భక్తులు

భీమడోలు: భీమడోలు పంచాయతీ సమీపంలోని నూతనంగా నిర్మించిన కోదండ రామాలయం, విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవ వేడుకలు బుధవారం సాయంత్రం నుంచి ఘనంగా ఆరంభమయ్యాయి. దాతల ఆర్థిక సాయంతో సుందరంగా నిర్మించిన ఆలయాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం ఆగమ స్తపతి, ఆగమ పండితులు రావిపాటి వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో వేద పండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. నాలుగు రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాల్లో భాగంగా ఈనెల 4న సీతారామచంద్ర లక్ష్మణ సమేత హనుమ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ పూజా కార్యక్రమాల్లో గ్రామంలోని పలువురు దంపతులు పీటలపై ఆశీనులయ్యారు. శ్రీరామనామ స్మరణతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధికి పునరంకితం కావాలి

- ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు
- ఘనంగా ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం



పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు,పార్టీ నేతలు



అన్నేవారిగూడెంలో పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

గణపవరం: అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగంతో ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన కారణంగా ఆంధ్రప్రదేశ్ అన్ని విధాలుగా నష్టపోయిందని, దీనిని భర్తీ చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఉదారంగా సహాయం అందించాలని కోరారు. పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగంతో ఏర్పడిన రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిలబెట్టడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. తొలుత తెలుగుతల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కోడే కాశీ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు నివాళులు

ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా మంగళవారం గణపవరం కన్యకాపరమేశ్వరి వర్తక సంఘ భవనం వద్ద పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వర్తక సంఘం అధ్యక్షుడు ఆర్‌వీఎస్ రాజు, ఉపాధ్యక్షుడు వంకాయల రామారావు, కార్యదర్శి నడిపల్లి రాంపండు పాల్గొన్నారు. గణపవరం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో జ్యోతిర్మయి, తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ పమ్మి లక్ష్మి, డిగ్రీ కాలేజీలో ప్రిన్సిపల్ నిర్మలకుమారి, పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ మూర అలంకారం ఆధ్వర్యంలో రాష్ట్రావతరణ వేడుకలు నిర్వహించారు. గణపవరం, పిప్పర శాఖా గ్రంథాలయాల వద్ద రాష్ట్ర అవతరణ వేడుకలు నిర్వహించి, పొట్టి శ్రీరాములుకు నివాళులర్పించారు.

ఆంధ్రుల ఆత్మ గౌరవాన్ని కాపాడిన మహోన్నత వ్యక్తి

భీమడోలు: అమరజీవి పొట్టి శ్రీరాములు జీవితం నేటి తరానికి ఆదర్శమని పలువురు వక్తలు అన్నారు. భీమడోలు, గుండుగొలను, పూళ్ల, అన్నేవారిగూడెం ప్రభుత్వ పాఠశాలలు, శాఖా గ్రంథాలయాల్లో బుధవారం ఆంధ్ర రాష్ట్ర ఆవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. అన్నేవారిగూడెం యూపీ పాఠశాలలో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి హెచ్‌ఎం షేక్ మస్తాన్ పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమిళుల ఆధిపత్యం నుంచి ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని కాపాడిన మహా యోధుడన్నారు. ఆంధ్రరాష్ట్రం కోసం తన ప్రాణాలను త్యాగం చేసిన మహోన్నత వ్యక్తి అన్నారు. ఆమరణ నిరాహార దీక్షను చేసి ఆంధ్రరాష్ట్రాన్ని సాధించిపెట్టిన మహోన్నత వ్యక్తి అన్నారు. నేటి పాలకులు పొట్టి శ్రీరాములు ఆశయ సాధనకు పాటు పడాలన్నారు. ఆయన దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్, టీచర్లు పాల్గొన్నారు.

రోగులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ



పూళ్లలో రోగులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేస్తున్న మానవత సంస్థ ప్రతినిధులు, వైద్యులు

భీమడోలు: పూళ్ల పంచాయతీ శివారు ఎంఎంపురానికి చెందిన రిటైర్డ్ రాష్ట్ర న్యాయ కార్యదర్శి, దివంగత వట్టి వీర వెంకట సత్యనారాయణ శత జయంతిని పురస్కరించుకుని మండల మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. పూళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఇన్‌పేషెంట్, అవుట్ పేషెంట్ రోగులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. రొట్టె, బిస్కెట్లు, పండ్లు వారికి అందించారు. ఈ సందర్భంగా మానవత ప్రతినిధులు మాట్లాడుతూ రాష్ట్ర న్యాయకార్యదర్శిగా వట్టి వీర వెంకట సత్యనారాయణ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు చేసిన సేవలు మరవలేనివన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వట్టి సుగుణాకర్, మండల కన్వీనర్ పంచకర్ల సత్యనారాయణ, మాజీ అధ్యక్షుడు పచ్చా వెంకటేశ్వరరావు, ఉన్నమట్ల సత్యనారాయణ, ఏఎంసీ వైస్ చైర్మన్ పులిచర్ల వెంకటకృష్ణారావు, వైద్యులు బి.లీలా ప్రసాద్, కల్యాణీ మహేశ్వరీ, మానవత సభ్యులు పాల్గొన్నారు.

చిన్నారి ఆరోగ్య సంరక్షణకు టీకాలు ప్రధానం



చిన్నారికి టీకా వేస్తున్న ఏఎన్‌ఎం

పెదవేగి : చిన్నారి ఆరోగ్య సంరక్షణకు టీకాలు ప్రధానమని పెదవేగి ఏఎన్‌ఎం మౌనిక అన్నారు. వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో భాగంగా పెదవేగి మండలంలో పలు గ్రామాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా పెదవేగిలో నిర్వహించిన కార్యక్రమంలో ఏఎన్‌ఎం మౌనిక మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డ దగ్గర నుంచి ఐదేళ్లు వచ్చే వరకు ప్రతి చిన్నారికి విధిగా టీకాలు వేయించాలన్నారు. టీ కాలతో పలురకాల వ్యాధుల నుంచి రక్షణ ఉంటుందని ఆమె తెలిపారు. గర్భిణులు వైద్యుల సూచనల మేరకు ధనుర్వాతం రాకుండా టీటీతోపాటు ఐరన్ మాత్రలను తప్పనిసరిగా తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కృష్ణవేణి, మల్లిక, ఆశా కార్యకర్తలు తులసి, వల్లీ, కృష్ణకుమారి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

పథకాల అమలుతో పేదలకు లబ్ధి



మాట్లాడుతున్న కొప్పాక సొసైటీ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు

పెదవేగి : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలతో పేదలకు లబ్ధి చేకూరుతుందని కొప్పాక సొసైటీ అధ్యక్షుడు చల్లగొళ్ళ వెంకటేశ్వరరావు(భూస్వామి) అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా పెదవేగి మండలం కొప్పాకలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు మాధవి, ప్రత్యూష, మధుసూదన్‌రెడ్డి, త్రిపోష, భార్గవి తదితరులు పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు చల్లగొళ్ళ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని ప్రజలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆయన సూచించారు. సర్పంచ్ పి భాస్కర దీక్షితులు, ఎంపీటీసీ ఎం.కోటేశ్వరరావు, ఎంఈవో 2 వి.అరుణ కుమార్, ఆర్ రామకృష్ణ, కొప్పాక జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం శైలజ, కార్యదర్శి సాయికృష్ణ పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రత్యేక ఓటర్ల శిబిరాలు

పెదవేగి : భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు దెందులూరు నియోజక వర్గ పరిధిలో ఉన్న 293 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఉన్న అన్ని గ్రామాల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు క్యాంపు లు నిర్వహిస్తున్నట్టు పెదవేగి తహసీల్దార్ నల్లమెల్లి నాగరాజు బుధవారం తెలిపారు. నియోజకవర్గంలో ఈ స్పెషల్ ఓటర్ల నమోదు కార్యక్రమాలు నవంబర్ 4, 5వ తేదీల్లో, డిసెంబర్ 2వ తేదీ, 3వ తేదీలతో నిర్వహిస్తున్నట్టు చెప్పారు. నియోజకవర్గ ప్రజలు భారత ఎన్నికల కమిషన్ ద్వారా నిర్వహించే స్పెషల్ ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని ఇప్పటి వరకు ఓటు హక్కు పొందని వారు ఫారం 6 ద్వారా తమ ఓటు హక్కును పొందడానికి కొత్తగా తమ పేరు నమోదు చేసుకోవచ్చన్నారు. ఫారం 7 ద్వారా ఓటరు జాబితాలలో మరణించిన ఓటర్లను తొలగిస్తారని చెప్పారు. ఫారం 8 ద్వారా ఇప్పటి వరకు నమోదు చేసిన ఓటరు జాబితాలో ఇతర దేశాలకు వెళ్లిన వారి పేర్లు, జీవనోపాధి నిమిత్తం వేరే నియోజక వర్గాల్లో స్థిరపడ్డ వారి పేర్లు సవరిస్తామని తహసీల్దార్ నాగరాజు తెలియజేసారు. నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే ఈ ఓటర్ల సవరణ కార్యక్రమంలో పాల్గొనే ఎన్నికల రిటర్నింగ్ అధికారి, అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి బూత్ లెవెల్ పోలింగ్ అధికారులు పాల్గొంటారని తహసీల్దార్ నాగరాజు తెలిపారు.

అవినీతి నిర్మూలనలో భాగస్వాములు కావాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తోన్న విజిలెన్స్ ఎస్పీ కరణం కుమార్

ఏలూరు టౌన్: సమాజంలోని అవినీతిని నిర్మూలించటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ముఖ్యంగా విద్యార్థి దశ నుంచే అవినీతి రహిత సమాజం కోసం పాటుపడాలని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కరణం కుమార్ సూచించారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా అవినీతి వద్దు.. జాతి అభ్యున్నతికి పాటుపడదామనే నినాదంతో ఏలూరు నగరంలోని శ్రీచైతన్య, నారాయణ విద్యా సంస్థల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అవినీతి నిర్మూలనపై వ్యాసరచన, గ్రూప్ డిస్కర్షన్ పోటీలు నిర్వహించారు. విజేతలకు విజిలెన్స్ ఎస్పీ కరణం కుమార్ చేతులమీదుగా బహుమతులు అందజేశారు. ప్రభుత్వం ప్రజలకు అవినీతి రహితంగా ఉత్తమ సేవలు అందించేందుకు కృషి చేస్తోందని కరణం కుమార్ అన్నారు. కార్యక్రమంలో విజిలెన్స్ డీఎస్పీ సింగులూరి వెంకటేశ్వరరావు, ఏఈ టి.శ్రీనివాసరావు, ఏజీ పి.శ్రీధర్, ఎస్సై సీహెచ్ రంజిత్, స్కూల్ ఏజీఎం పి.రామిరెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

- వట్లూరు సచివాలయంలో గ్రామ సభ నిర్వహించారు. అవినీతి రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రజలంతా సహకరించాలని విజిలెన్స్ డీఎస్పీ వెంకటేశ్వరరావు కోరారు. ప్రభుత్వం అందిస్తోన్న సంక్షేమ పథకాలు పక్కదారి పట్టకుండా, కల్తీ ఆహార పదార్థాల నివారణ, మౌలిక వసతుల అభివృద్ధి, పన్నులు సక్రమంగా చెల్లించటం, సహజ వనరుల సంరక్షణపై ప్రజలంతా అవగాహనతో ఉండాలని కోరారు.

వరిలో పొట్టకుళ్లు తెగులు



వైఎస్సార్ పొలంబడిలో రెతులకు సూచనలిస్తున్న వ్యవసాయ అధికారులు

గణపవరం: ప్రస్తుతం సార్వా వరి పైరుపై పొట్ట కుళ్లు తెగులు కనిపిస్తోందని, దీనిపై రైతులంతా అవగాహన కలిగి ఉండాలని జిల్లా వ్యవసాయ అధికారి జెడ్. వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం గణపవరం మండలం అప్పనపేటలో వైఎస్సార్ పొలం బడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులకు పొట్ట కుళ్లు తెగులుపై వెంకటేశ్వరరావు వివరించారు. వరి మొక్కలు దగ్గరగా నాటడం వల్ల ఈ తెగులు వస్తుందని, వాతావరణంలో ఉష్ణోగ్రతలు 20 డిగీల నుంచి 28 డిగ్రీల సెంటీగ్రేడు ఉన్నప్పుడు ఈవ్యాధి వ్యాప్తి చెందుతుందని వివరించారు. దీని నివారణకు కార్బన్‌డిజం, మంకోజాబ్ 2గ్రాముల మందుకలిపి లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. తాడేపల్లిగూడెం ఏడీఏ మురళీకృష్ణ మాట్లాడుతూ విత్తనోత్పత్తిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెడ విరుపు తెగులు నివారణ చర్యలు వివరించారు. దీని నివారణకు ట్రైసైక్లోజోల్ 75 శాతం 0.6గ్రాముల మందును ఒకలీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారి యర్రంశెట్టి ప్రసాద్ పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు

ఏలూరు టౌన్: ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఏలూరు అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు అన్నారు. ఏలూరు పవర్‌పేట చిట్టివలసపాకలు ప్రాంతాల్లోని ప్రజలకు దోమల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్వరం వస్తే వెంటనే తమ సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రిలోని వైద్యులను సంప్రదించాలని, జ్వరాల నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు. ఇంటి పరిసరాల్లో ఉన్న డ్రమ్ములు, నీటి తొట్టెలు, ఓవర్‌హెడ్ ట్యాంకులు, రుబ్బురోళ్లు, వాడేసిన టైర్లు, కొబ్బరి బొండాలు వంటివాటిలో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పనికిరాని వస్తులను ఇంటిలో, పరిసరాల్లో ఉంచుకోకుండా కార్పొరేషన్ చెత్త వాహనాలకు అందించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఝాన్సీ, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఆరోగ్య కార్యకర్తలు విమల, రోజా, అశా కార్యకర్తలు అరుణ, ప్రియాంక, సునీత, వలంటీర్లు, నగరపాలక సంస్థ సిబ్బంది ఉన్నారు.

చురుగ్గా సచివాలయ నిర్మాణ పనులు

ఏలూరు రూరల్: ఏలూరు రూరల్ మండలం పెదయాగనమిల్లి గ్రామాల్లో చేపట్టిన సచివాలయ, వైఎస్సార్ క్లినిక్ భవనం పనులు చురుగ్గా సాగుతున్నాయని ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు అన్నారు. బుధవారం ఆయన సచివాలయం శ్లాబ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల కొల్లేరు గ్రామంలో రూ.65 లక్షలతో సచివాలయం, వైఎస్సార్ క్లినిక్ పనులు ప్రభుత్వం చేపట్టిందని చెప్పారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం పాలన ప్రజల ముంగిట తెచ్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. కోటేశ్వరదుర్గాపురంలో సుమారు రూ.2 కోట్లతో పూర్తి చేసిన అభివృద్ధి పనులను త్వరలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి చేతుల మీదగా ప్రారంభిస్తామన్నారు.

రేపు గురుకుల పాఠశాల భవనాల ప్రారంభోత్సవం

చింతలపూడి: పట్టణంలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన సోషల్ వెల్ఫేర్ బాలుర గురుకుల పాఠశాల భవనాలను ఈనెల 3వ తేదీన ప్రారంభోత్సవం చేయనున్నట్లు చింతలపూడి ఎమ్మెల్యే ఎలీజా తెలిపారు. ఈ భవన నిర్మాణాలను బుధవారం ఆయన పరిశీలించారు. మొత్తం రూ.10.12 కోట్ల వ్యయంతో గురుకుల పాఠశాల భవనాలను నిర్మించారని తెలిపారు. విద్యార్థుల డార్మెటరీ, పాఠశాల భవనాలతో పాటు వంటగది, డైనింగ్ హాలు, స్టాఫ్ క్వార్టర్లు, ప్రిన్సిపాల్ క్వార్టర్ నిర్మాణ పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. నూతన గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. టీడీపీ హయాంలో గురుకుల పాఠశాల నిర్మాణం విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం కారణంగా ఏళ్ల తరబడి పనులు ముందుకు సాగలేదని అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన స్పందించి గురుకుల పాఠశాల భవనాలను పూర్తి చేయడానికి ఆదేశాలు ఇచ్చారని చెప్పారు.

జగన్‌తోనే అన్నివర్గాలకు సామాజిక న్యాయం



సాయిబాల పద్మను పరామర్శిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

జంగారెడ్డిగూడెం: అన్ని వర్గాలకు సామాజిక న్యాయం కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ అన్నారు. ఇటీవల అనారోగ్యానికి గురై విజయవాడలో శస్త్రచికిత్స పొంది జంగారెడ్డిగూడెంలో విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు వందనపు సాయిబాల పద్మను బుధవారం జెడ్పీ చైర్‌పర్సన్ పరామర్శించారు. ఆమె త్వరగా కోలుకొని ప్రజాక్షేత్రంలోకి రావాలని ఆకాంక్షించారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ విలేకరులతో మాట్లాడుతూ అక్టోబర్ 30న దెందులూరు నియోజకవర్గం గోపన్నపాలెంలో నిర్వహించిన సామాజిక సాధికారిత బస్సు యాత్ర విజయవంతమైందన్నారు. గ్రామ సర్పంచ్ నుంచి డిప్యూటీ సీఎం వరకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు అందరికి ప్రత్యేకమైన స్థానం కల్పించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఘంటా ప్రసాదరావు, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, వైస్ ఎంపీపీ నరెడ్ల బుజ్జిబాబు, మున్సిపల్ వైస్‌చైర్మన్ ముప్పిడి అంజి, వందనపు వెంకటేశ్వరరావు, చిప్పాడ వెంకన్న, వంటిపల్లి సీతారామస్వామి, కాశీ, కర్పూరం జనార్దన్, పలువురు ఆర్యవైశ్య సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఓట్ల నమోదుకు ప్రత్యేక శిబిరాలు

దెందులూరు: భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలోని దెందులూరు నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో ఓట్లు నమోదు నిమిత్తం ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి జీవీవీ సత్యనారాయణ బుధవారం తెలిపారు. ఈ శిబిరంలో ఈనెల 4,5, డిసెంబర్ 2, 3 తేదీల్లో నియోజకవర్గంలోని 239 పోలింగ్ కేంద్రాల్లో బూత్ లెవెల్ అధికారుల ఆధ్వర్యంలో ఈఆర్ఓ ఎఈఆర్ఓ పర్యవేక్షణలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తగా ఓటరు నమోదుకు ఫారం-6, మరణించిన ఓటర్లను తొలగించడానికి ఫారం 7 ఇప్పటి వరకు ఓటరు జాబితాలో నమోదు చేసి వివరాలు సవరణకు ఫారం-8 ఉపయోగించుకోవాలన్నారు.

వైద్యశాలకు వెళ్లి పింఛన్ అందజేత



ఏలూరు ప్రభుత్వ వైద్యశాలలో పింఛన్ అందజేస్తున్న వలంటీర్ కే నాగలక్ష్మి

దెందులూరు: కొవ్వలి గ్రామానికి చెందిన సత్యవతి అనారోగ్యంతో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. బుధవారం గ్రామానికి చెందిన వలంటీర్ కే నాగలక్ష్మి వైద్యశాలకు వెళ్లి పింఛన్ నగదును అందజేశారు. వలంటీర్ నాగలక్ష్మిని కొవ్వలి సర్పంచ్ ఇంటేటి మధులత, దెందులూరు ఏఎంసీ వైస్ చైర్మన్ కాటి సుధాకర్, వైస్ ఎంపీపీ గొల్ల నాగరాజు, సొసైటీ చైర్మన్ కొమ్మిన రాము, ఎంపీటీసీ గొరిపర్తి వరలక్ష్మి రంగారావు అభినందించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

దెందులూరు: కడుపునొప్పి తాళలేక పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. దెందులూరు ఎస్సై చల్లా కృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చల్లచింతలపూడి గ్రామానికి చెందిన ఆదినారాయణ కడుపు నొప్పితో బాధపడుతూ పది రోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే అతనిని ఏలూరు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

నేడు, రేపు ఉంగుటూరులో 'గడపగడపకు'

ఉంగుటూరు: ఉంగుటూరులో ఎమ్మెల్యే వాసుబాబు ఆధ్వర్యంలో గురు, శుక్రవారాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్ సీపీ మండల పార్టీ కన్వీనర్ మరడ మంగరావు తెలిపారు. గురువారం సాయంత్రం 4 గంటలకు ఉంగుటూరులో 210 వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం తూర్పు కాపుల వీధి, వెలంపేట, కాపుల పేటలో పర్యటిస్తారని తెలిపారు. 211వ రోజు శుక్రవారం రజకపేట, సంత బజారు, కాపుల వీధిలో వాసుబాబు పర్యటిస్తారని మంగరావు వివరించారు. వైఎస్సార్ సీపీ పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు పాల్గొని జయప్రదం చేయాలని మంగరావు కోరారు.

పాలగూడెంలో కనకమద్ది రావమ్మ విగ్రహ ప్రతిష్ఠ



కనకమద్దిరావమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే కొఠారు

ఏలూరు రూరల్: ఏలూరు రూరల్ మండలం పాలగూడెంలో కనక మద్దిరావమ్మ విగ్రహాన్ని బుధవారం ఉదయం 7.41 గంటలకు వేదపండితులు మంత్రోచ్చరణ, మేళతాళాలు మధ్య ప్రతిష్ఠించారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి గ్రామ ప్రజలు, నాయకులతో కలిసి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ప్రజలు సిరిసంపదలు, పాడి పంటలతో తులతూగేలా చూడాలని గ్రామ దేవతను వేడుకున్నారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు, సర్పంచ్ పత్యాల సునీత, ఉపసర్పంచ్ వైఎస్సార్ సీపీ నాయకులు మండల కొండలరావు, తేరా ఆనంద్, ముంగర సంజీవ్‌కుమార్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.